
సాక్షి
అనంతపురం

ఆదివారం । 28 । జనవరి । 2024



కమ్మలతో ఉడాయించిన ఘనుడు

బంగారు షాపులో కొంటున్నట్టు నటించి జత కమ్మలతో ఉడాయించాడు ఓ ఘనుడు. రాయదుర్గంలో ఈ ఘటన జరిగింది. IIలో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.8°/ 15.7°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

చిరుతల సంచారంతో భయాందోళన



బోదపల్లి సమీపంలో వాహదారులకు ఎదురుపడ్డ చిరుత

కుందుర్పి: చిరుతలు ఇటీవలి కాలంలో అడవులు వదిలి జనారణ్యంలోకి వస్తున్నాయి. కుందుర్పి మండలం బోదపల్లి, గురువేపల్లి తదితర గ్రామాల మధ్య చిరుతలు సంచరిస్తున్నాయి. శుక్రవారం రాత్రి బోదపల్లి సమీప పొలంలోంచి టమాటాల లోడుతో వస్తున్న బొలెరో వాహనానికి చిరుత అడ్డువచ్చిందని రైతులు తెలిపారు. గట్టిగా హారన్ కొట్టడంతో ఆ చిరుత సమీప పొదల్లోకి పారిపోయిందన్నారు. వారం కిందట కెంచంపల్లి రామాంజనేయులుకు చెందిన గేదెను, కిష్టప్పకు చెందిన మేకను ఓ చిరుత చంపేసింది. ఆహారం, నీటి కోసం వచ్చే చిరుతులు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతలను పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదిలేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రూప్ 1, 2 శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1, 2 పరీక్షల కోసం నిర్వహించే శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు కుష్బూ కొఠారి తెలిపారు. ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఇప్పటికే ఒక బ్యాచ్‌కు గత నెల రోజుల నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వడంతో పాటు రోజూ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రాక్టీస్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. లైబ్రరీ, స్టడీ మెటీరియల్, స్టైఫండ్, బుక్ అలవెన్స్ ఉన్నాయన్నారు. గ్రూప్–1, 2 పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం, బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వీరభద్రుని సేవలో జస్టిస్ మన్మథరావు



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న జస్టిస్ మన్మథరావు దంపతులు

లేపాక్షి: హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు శనివారం లేపాక్షి వీరభద్రుని సేవలో గడిపారు. మధ్యాహ్నం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. అంతకుముందు న్యాయమూర్తి దంపతులకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్‌తో పాటు అర్చకులు స్వాగతం పలికారు. జస్టిస్ మన్మథరావు వెంట హిందూపురం రెండో అదనపు జిల్లా జడ్జి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, తహసీల్దార్ బాబు, డీఎస్పీ కంజాక్షన్, రూరల్ సీఐ వేణుగోపాల్, చిలమత్తూరు ఎస్‌ఐ గంగాధర్ ఉన్నారు.

శనీశ్వరునికి ప్రత్యేక పూజలు

పావగడ: జస్టిస్ మన్మథరావు దంపతులు శనివారం పావగడ శనీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి తైలాభిషేకం చేసి నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. జస్టిస్ వెంట ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్, హిందూపురం ఏడీ జడ్జి కె.శైలజ, రాజ్యలక్ష్మి, సీనియర్ న్యాయవాది భాస్కర్ రాయుడు, స్థానిక కాంగ్రెస్ నాయకుడు కోర్టు నరసప్ప పాల్గొన్నారు.

రైతు చెంతకే మార్కెట్

రైతులకు జగన్ సర్కార్ అన్ని విధాలా అండగా నిలుస్తోంది. పంట సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలను, ఎరువులను ఇస్తోంది. ఇదంతా ఒక ఎత్తయితే రైతు పండించిన పంటను మార్కెట్ ధరతో కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటోంది. వ్యయప్రయాసలు తప్పించి ఇంటి వద్దే కందుల కొనుగోలు చేస్తోంది.

- కందుల కొనుగోలు ప్రారంభం
- మార్కెట్ ధరతో రైతు ఇంటి వద్దే సేకరణ
- ఎంత పంట ఉంటే అంతా కొనుగోలు
- తప్పిన కూలిలు, సంచులు, రవాణా ఖర్చు
- వారంలోపే 146.55 టన్నుల కందుల సేకరణ
- రైతుల ఖాతాలకు రూ. 50.74 లక్షల జమ

అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో రైతు ఇంటి వద్దనే కందులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



అనంతపురం అర్బన్: జగన్ సర్కారు రైతు ముంగిటకే వ్యవసాయ సేవలను తీసుకొచ్చింది. అందులో భాగంగా కంది పంటకు ఇంటి వద్దే మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. రైతు ఇంటి వద్దే కందులు కొనుగోలు చేసే ప్రక్రియ ఈ నెల 20వ తేదీన ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటి వరకు ఉరవకొండ, వజ్రకరూరు, బెళుగుప్ప, విడపనకల్లు, అనంతపురం రూరల్ మండలాల్లో 78 మంది రైతుల నుంచి 146.55 టన్నుల కందులను పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసింది. కందుల సేకరణకు ప్రభుత్వం పరిమితేమీ విధించలేదు. రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంతా కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కొనుగోలుకు సంబంధించి డబ్బును రైతుకు చెల్లించేందుకు ప్రభుత్వం 21 రోజుల గడువు విధించినప్పటికీ... వారం రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది.

మార్కెట్ ధరతో కొనుగోలు

కందులను ప్రభుత్వం మార్కెట్ ధరతో రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. మార్కెట్ ధర ఆధారంగా సీఎం యాప్‌లో రోజు వారీగా ధర నిర్ణయిస్తారు. ఏ రోజు ధరతో ఆ రోజున కందులను పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేస్తుంది. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు క్వింటాలు కందులు రూ.9,300 నుంచి రూ.9,400 మధ్య కొనుగోలు చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా శనివారం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో క్వింటాలు కందులు రూ.9,370.35 పైసలుతో రైతుల నుంచి కొనుగోలు చేశారు.

వారంలోగా నగదు జమ

కొనుగోలు చేసిన కందులకు సంబంధించి నగదును రైతులకు ప్రభుత్వం వారంలోగా చెల్లిస్తోంది. 21 రోజుల్లో చెల్లింపులు జరుగుతుందని చెప్పినప్పటికీ... రైతుల అర్థిక అవసరాల దృష్ట్యా వారంలోగానే వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తోంది. 78 మంది రైతుల నుంచి కందులను కొనుగోలు చేయగా... వారం వ్యవధి పూర్తయిన 29 మంది రైతుల ఖాతాల్లోకి రూ.50,74,130 జమ చేసింది. మిగిలిన 49 మందికి సంబంధించి రూ.86,41,539 మొత్తాన్ని మూడు నాలుగు రోజుల్లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు వద్దకే వెళ్లి...

కందుల కొనుగోలుకు సంబంధించి రైతుపై ఎలాంటి ఆర్థిక భారమూ పడకుండా కూలీలు, గోనె సంచులు, రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. పంట రైతుల ఇంటి వద్ద ఉన్నా... కల్లంలో ఉన్నా సరే... పౌర సరఫరాల సంస్థ అధికారులు నేరుగా అక్కడికే వెళ్లి పంటను రైతుల ఎదుటే తూకం వేసి సంచులు సీల్ చేస్తున్నారు. ఒకవేళ రైతులు గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాటు చేసుకుంటే... ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి కందుల సొమ్ముతో పాటు జమ చేస్తున్నారు.

ఎఫ్‌టీఓ ద్వారా చెల్లింపులు

ధాన్యం సేకరణకు సంబంధించిన నగదు నేరుగా రైతు ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుంది. రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌తో పాటు ఆధార్ అనుసంధానమైన బ్యాంక్ ఖాతా తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ వెంటనే సంబంధిత రైతు ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) క్రియేట్ అవుతుంది. దాని ఆధారంగా రైతు ఖాతాల్లోకి నగదును ప్రభుత్వం జమచేస్తుంది.

ప్రభుత్వ సూచనలు...

- కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న కందులను రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. లేనిపక్షంలో రైతులు తమ కందులను నాణ్యతాప్రమాణాలకు లోబడే విధంగా మెరుగుపరిచి సిద్ధం చేసుకోవాలి.
- ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుని, ఈ–కేవైసీ పూర్తయిన రైతుల్లో తమ కందులను విక్రయించేందుకు సిద్ధపడిన వారి నుంచే కొనుగోలు చేస్తారు. విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలి.

కందుల నాణ్యతా ప్రమాణాలు	అనుమతించిన గరిష్ట శాతం
వ్యర్థ పదార్థాలు ఎ) అసేంద్రియ వ్యర్థ పదార్థాలు (0.25 శాతం మించరాదు) బి)జంతు వ్యర్థ పదార్థాలు (0.1 శాతం మించరాదు)	2.0
ఇతర పప్పు గింజలు	3.0
ఇతర తిండి గింజలు	1.0
దెబ్బతిన్న/కొంచెం దెబ్బతిన్న గింజలు	3.0
నూకలు/బద్దలు	3.0
పురుగు పట్టిన గింజలు	3.0
తేమ	12.0
అపరిపక్వ, ముడతలు పడిన గింజలు	3.0

రైతు వద్దకే వెళ్లి కొనుగోలు



రైతు తన పంటను నిల్వ చేసుకున్న ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధరతో కొనుగోలు చేస్తున్నాం. కొనుగోలు క్రమంలో రైతుపై ఎలాంటి ఆర్థిక భారం పడకూడదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సీఎం యాప్‌లో రోజువారి ధరను ఉంచుతుంది. ఆ ప్రకారం కొనుగోలు చేస్తున్నాం. ఈ నెల 20వ తేదీ నుంచి ఇప్పటి వరకు 78 మంది రైతుల నుంచి 146.55 టన్నుల కందులు కొనుగోలు చేశాం. 29 మంది రైతుల ఖాతాల్లోకి రూ.50,74,130 జమయ్యింది. మిగిలిన 49 మందికి సంబంధించి రూ.86,41,539 మొత్తం మూడు నాలుగు రోజుల్లో జమ అవుతుంది.

– జె.రవీంద్ర, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

సేకరణకు పరిమితి లేదు



రైతుల నుంచి కందుల సేకరణకు ఎలాంటి పరిమితీ లేదు. ఎంత ఉన్నా కొనుగోలు చేస్తాం. కొనుగోలుకు సంబంధించి మండల వారీ షెడ్యూల్ తయారు చేశాం. ఆ ప్రకారం పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ మండల వారీగా క్యాంపు నిర్వహిస్తూ రోజూ సేకరణ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. సేకరించిన పంటకు సంబంధించి నగదును రైతుల ఖాతాల్లోకి వారంలోగా ప్రభుత్వం జమ చేస్తోంది. ఇక రైతుపై ఆర్థిక భారం పడకుండా హమాలీల కూలి, గోనె సంచులను, రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ఫిబ్రవరి 22 నుంచి న్యాక్ పీర్ కమిటీ పర్యటన



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ జేఎన్‌టీయూ అనంతపురంలో ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు పర్యటించనుంది. న్యాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులతో వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు శనివారం సమీక్ష నిర్వహించారు. పర్యటనలో పాటించాల్సిన నియమ, నిబంధనలు, కమిటీకి చూపించాల్సిన పత్రాలపై వీటీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ బాల వీరారెడ్డి అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ఐక్యూఏసీ డైరెక్టర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, పాలక మండలి సభ్యులు బి.దుర్గాప్రసాద్, ఎం.రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు పరుగు పెట్టిద్దాం



క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న భాగ్యరాజ్, పీఆర్ ఇంజినీర్లు

అనంతపురం సిటీ: పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలని సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) యమ్మాని భాగ్యరాజ్ సూచించారు. పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ రూపొందించిన 2024 కొత్త సంవత్సర క్యాలెండర్లు, డైరీలను తన ఛాంబర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈఈలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. వాటిని గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పీఆర్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డీఎల్ మురళి, ఉపాధ్యక్షురాలు జింకా కృష్ణజ్యోతి, జనరల్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్ర, ట్రెజరర్ పాండురంగారెడ్డి, డీఈఈ రసూల్, ఈఈలు నారాయణస్వామి, హనుమంతయ్యశెట్టి, మధుసూదన్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గలీజు జేసి



- తాడిపత్రిలో పడకేసిన 'పుర' పాలన
- పట్టణంలో పేరుకుపోయిన చెత్త నిల్వలు
- సమస్యలు పట్టని మున్సిపల్ ఛైర్మన్ జేసీ

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన స్వార్థ రాజకీయాల్లో మునిగిపోయి పుర ప్రజల బాగోగులను గాలికొదిలేశారు. పురపాలక సంఘాల్లో తాడిపత్రికి ఒకప్పుడు ప్రత్యేకత ఉండేది. స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలిచి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంది. మున్సిపల్ చైర్మన్ జేసీ నిర్వాకంతో నేడు ఎక్కడపడితే అక్కడ చెత్త నిల్వలు పేరుకుపోయాయి.



తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డులో పేరుకుపోయిన చెత్త



మున్సిపాలిటీ గ్యారేజీలో రిపేరీకి నోచుకోని చెత్త సేకరణ వాహనాలు

తాడిపత్రి: ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉంది మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో 'సేవ్ తాడిపత్రి' పేరుతో మొసలి కన్నీరు కార్చిన జేసీ.. చైర్మన్ పీఠం ఎక్కాక పాలనను విస్మరించారు. ఎంతసేపూ ప్రొటోకాల్ పేరుతో మున్సిపల్ అధికారులను ఇబ్బందులకు గురి చేయడం మినహా పుర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. 'నా ఊరు.. నా ప్రజలు' అంటూ గొప్పలు చెప్పుకోవడం మినహా అందుకు అనుగుణంగా అడుగులు మాత్రం వేయలేదు. అధికార దాహంతో ఆయన పెద్దవడుగూరులో బస్సు యాత్రలో నిమగ్నమవడం విమర్శలకు తావిస్తోంది.

వాహనాల నిర్వహణ ఏది?

మున్సిపాలిటీలో మొత్తం 18 చెత్త వాహనాలు ఉన్నాయి. ఇందులో కొన్ని వాహనాలను స్వచ్ఛంద సంస్థలు విరాళంగా ఇచ్చాయి. ప్రస్తుతం వీటిలో 10 చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు నోచుకోక గ్యారేజీలో మూలనపడ్డాయి. మిగిలిన ఎనిమిది వాహనాల ద్వారా చెత్త సేకరిస్తున్నారు. వాహనాల నిర్వహణను మున్సిపల్ పాలకవర్గం గాలికి వదిలేయడంతో పట్టణంలో పూర్తిస్థాయిలో చెత్త సేకరణ జరగడం లేదు. దీంతో యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు, నంద్యాల రోడ్డు, ఏటిగడ్డపాళెం, మెయిన్ బజార్, ప్రధాన రహదారి సీబీ రోడ్డులోని డివైడర్లలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోజూ ఉదయం ఇంటి వద్దకే రావాల్సిన చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో ప్రజలు చేసేదేమీ లేక చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలకు అడ్డుకట్ట

మున్సిపల్ పరిధిలో వార్డులన్నీ చెత్తమయమయ్యాయి. ప్రజల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా తన సొంత ఖర్చులతో ఇటీవల చెత్త సేకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఎమ్మెల్యేకు ప్రజల్లో ఆదరణ వస్తుందన్న అక్కసుతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుకూల కార్మికుల ద్వారా చెత్త సేకరణ పనులను అడ్డుకునేలా చేశారు. చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తనవంతు ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే చర్యలను జేసీ కుటిల రాజకీయాలతో అడ్డుకుంటూ ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పట్టణ పరిశుభ్రతకు తాను నడుం బిగించక.. ఇతరులు చేస్తే వారికెక్కడ మంచి పేరు వస్తుందోనని ఓర్వలేక కంటగింపుగా మారిన జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కంది పంటకు నిప్పు

- టీడీపీ నాయకులపై బాధితుడి ఫిర్యాదు

తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగయ్యకు చెందిన కంది పంటకు నిప్పు పెట్టారు. ఇది టీడీపీ నాయకులు సత్యంరెడ్డి, యుగంధర్ పనేనని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే.. రంగయ్య మూడు రోజుల క్రితం కంది పంటను కోసి పొలంలోనే ఆరబెట్టారు. ఇంతలోనే పంటకు నిప్పు పెట్టడంతో దాదాపు లక్ష రూపాయల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఈ నెల 8న తాడిపత్రి టీడీపీ నాయకుడు జేసీ అస్మిత్‌రెడ్డి చీమలవాగుపల్లిలో పర్యటించారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు కావాలనే వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు టీడీపీ జెండాలు కట్టి గొడవలకు ఉసిగొల్పారు. గొడవలకు సంబంధించి బాధితుడు రంగయ్య కుమారుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీన్ని మనసులో పెట్టుకునే కంది పంటకు నిప్పు పెట్టి ఉంటారంటూ టీడీపీ నాయకులు సత్యంరెడ్డి, యుగంధర్‌పై బాధితుడు రంగయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితుడికి పరామర్శ

కంది పంటకు నిప్పు పెట్టిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి శనివారం చీమలవాగుపల్లికి వెళ్లి బాధితుడు రంగయ్యను పరామర్శించారు. అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కక్షలు రాజేయడానికి జేసీ సోదరులు టీడీపీ కార్యకర్తలను ఉసి గొల్పుతున్నారని ఆరోపించారు. పంటలు తగులబెట్టి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. చేతనైతే మంచి చేసి అభిమానం పొందాలే తప్ప ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొడవల జోలికి వెళ్లకుండా సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రామూర్తిరెడ్డి, యువజన నాయకుడు యోగేశ్వరరెడ్డి, సర్పంచ్ రంగేశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలిపోయిన కంది పంటను పరిశీలిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

2019 లో 1,2,3,4,5 ర్యాంకులతో పాటు 600 పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సంస్థ
GROUP-I,II
తేజ రఘువీర టవర్స్, అనంతపురము 9948567527, 9490859421 హాస్టల్ కలదు

అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...



అనంతపురం జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 9346917084 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష.. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ట అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెట్ ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ మీకు కావలసిన ఇసుక క్వాంటిటీని నేరుగా ఇసుక రీచ్ వద్ద తగినంత అమౌంట్ చెల్లించి పొందగలరు.
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
రాయదుర్గం	రూ. 630/-	గుంతకల్	రూ. 785/-
కళ్యాణదుర్గం	రూ. 475/-	ఉరవకొండ	రూ. 730/-
సింగనమల	రూ. 845/-	రాప్తాడు	రూ. 700/-
అనంతపురము అర్బన్	రూ. 790/-	తాడిపత్రి	రూ. 725/-

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500
వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 93981 89034

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

28-01-2024
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ దుర్మరణం



సత్యనారాయణ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: రోడ్డు ప్రమాదంలో వలంటీర్ దుర్మరణం చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా అంకిరెడ్డి పల్లికి చెందిన సత్యనారాయణ (28) శనివారం తన ద్విచక్రవాహనంపై తాడిపత్రికి వచ్చాడు. పట్టణంలోని ఓ మెకానిక్ షాపులో బైకు రిపేరీ చేయించుకుని తిరుగుపయనమయ్యాడు. నంద్యాల రోడ్డులోని ఓ డాబా ముందు డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా లారీ ఢీకొంది. తీవ్రగాయాలైన సత్యనారాయణ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, 8 నెలల కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

అనంతపురం క్రైం: మహిళ మెడలోని బంగారు పుస్తెల గొలుసును దుండగులు అపహరించిన ఘటన నగర శివారులోని శారదానగరులో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. శారదానగరుకు చెందిన అనంత లక్ష్మి పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె మనమళ్లతో కలసి శారదానగరులో ఉంటోంది. రోజులాగానే శనివారం తెల్లవారుజామున 6.30 సమయంలో వాకింగ్‌కు వెళ్లింది. ఈ క్రమంలోనే బైకుపై కొందరు దుండగులు ఆమె వద్దకు వచ్చారు. 3 తులాల బంగారు గొలుసు లాక్కుని ఉడాయించారు. మహిళ గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది సదరు మహిళతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడి అరెస్టు

తనకల్లు: మండల పరిధిలోని నడిమికుంటపల్లిలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సంజీవులు, వెంకటేషు అన్నదమ్ములు. ఈ నెల 24న చేపల కూర విషయంలో జరిగిన గొడవలో తమ్ముడు వెంకటేష్ తన అన్న సంజీవులుపై చెక్కతో దాడి చేశాడు. సంజీవులు అక్కడికక్కడే మృతి చెందాడు. పరారీలో ఉన్న వెంకటేషును శనివారం పోలీసులు అరెస్టు చేశారు.

డ్రస్ సర్కిల్

కావలెను

- సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (స్త్రీ/పు)
- డ్రైవర్స్
- జెంట్స్ హెల్పర్స్

అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి గల అభ్యర్థులు తేదీ 29-01-2024, సోమవారం ఉ: 11గం॥లకు "డ్రస్ సర్కిల్" షాపింగ్ మాల్ సుభాష్ రోడ్, అనంతపురం నందు సంప్రదించగలరు.



కందుకూరు వద్ద పొలాలను కమ్మేసిన పొగమంచు



చిగిచెర్ల వద్ద మంచుదుప్పటి..



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో కురుస్తున్న మంచు

మంచు కరిగి.. సెగలు పెరిగి

జిల్లావ్యాప్తంగా ఇటీవల వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఉదయం మంచు దుప్పటి కప్పేస్తుండగా.. మధ్యాహ్నం సూరీడు సెగలు కక్కుతున్నాడు. రహదారులు ఎండమావులను తలపిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉక్కపోతకు జనం ఇబ్బంది పడుతున్నారు. గత నాలుగేళ్లు కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల్లో నీరు నిలిచి ఉండడంతో వన్యప్రాణులకు ఉపశమనం లభిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆలమూరు వద్ద ఎండమావి



బి.యాలేరు చెరువులో ఎండకు సేద తీరుతున్న పక్షులు

విద్యా సదస్సును విజయవంతం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: 'ప్రభుత్వ పాఠశాలల మనుగడ, బలోపేతం' అనే అంశంపై ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే విద్యాసదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం, బలోపేతం చేసుకోవడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు లేకపోతే బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని వాపోయారు. విద్యా సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డీఈఓ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల హాజరవుతారన్నారు. సదస్సుకు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్, అసోసియేట్ కార్యదర్శి బి. హనుమప్ప, సబ్ కమిటీ సభ్యులు డేనియల్, నాగరాజు, గాయత్రి, బొమ్మయ్య, భాస్కర్, సతీష్, సుభద్ర, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, చెన్నకేశవులు, సుజాత, సంగప్ప, బాల రామ్మోహన్, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. జిల్లా త్రోబాల్ కార్యదర్శి, దివంగత పవన్‌కుమార్ రెడ్డి స్మారకార్థం శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ త్రోబాల్ బాలబాలికల క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. తన వంతుగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.60 వేల బహుమతి ప్రకటించారు. పిల్లలు సెల్‌ఫోన్లలో కాకుండా క్రీడా మైదానాల్లో ఆడేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 450 మంది క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ చెడిపోతుల గోపాల్, బండి వీరనారప్ప, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, బ్యాళ్ల పెద్దయ్య, బండి నాగభూషణ, ఈడిగ కాశప్ప, నడిమిటి షెక్షావలి, లింగమయ్య, కుమ్మర వెంకటరమణ, జాంపుల చంద్రమోహన్, అప్రాచెరువు ఈశ్వర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ అక్కిం దామోదర్, ముక్కోటి అంబికా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దంపెట్ల శివ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్, పీడీలు కేశవమూర్తి, ప్రభాకర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనేలా నటించి.. కమ్మలతో ఉడాయించి

రాయదుర్గంటౌన్: బంగారు దుకాణంలో కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ రెండు కమ్మలను చోరీ చేశాడో మాయగాడు. రాయదుర్గం పట్టణంలో ఈ ఘటన జరిగింది. వివరాలు.. స్థానిక తహసీల్దార్ రోడ్డులో ఇస్మాయిల్ అనే వ్యక్తి ఎంకే జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో దుకాణానికి ఓ వ్యక్తి వచ్చాడు. బంగారు కమ్మలు కొంటానంటూ దాదాపు 20 నిమిషాలు నగలను చూశాడు. కాల్ రావడంతో ఇస్మాయిల్ ఫోన్లో మాట్లాడుతూ ఉన్నాడు. ఈ క్రమంలోనే రెండు కమ్మలను తీసుకుని మాయగాడు పరారయ్యాడు. ఇస్మాయిల్ వెంటనే తేరుకుని వెంబడించినా ప్రయోజనం లేకుండా పోయింది. చోరీ ఘటన మొత్తం సీసీ కెమెరాలో రికార్డయింది. ఒక్కో కమ్మ రూ.25 విలువ చేస్తుందని బాధితుడు తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పాడు.

జనవాక్కు

ఆజన్మాంతం రుణపడి ఉంటాం



పామిడి పంచాయతీలోని శ్రీ సత్యసాయి మహిళా సంఘంలో 18 ఏళ్ల నుంచి సభ్యురాలిగా కొనసాగుతున్నా. 'వైఎస్సార్ చేయూత' పథకం కింద నాలుగేళ్లు రూ.75,000 అందింది. ఆ డబ్బుతో గుత్తి బీసీసీ రోడ్డులో జనరల్ స్టోర్ పెట్టుకున్నా. ప్రభుత్వమే నాణ్యమైన సరుకులను ఎటువంటి రవాణా చార్జీలు లేకుండా స్టోరుకు చేరవేస్తోంది. రోజుకు రూ.8 వేల వ్యాపారం జరుగుతోంది. పెట్టుబడి పోనూ రోజుకు రూ.1,500 దాకా ఆర్జిస్తున్నా. 'జగనన్న తోడు' పథకం కింద అందిన డబ్బుతో పెద్దకొడుకు డీ హాజివలికి బజ్జీలు, ఎగ్‌బుర్జ్ బండి పెట్టించా. దీనికితోడు ప్రతి నెలా వైఎస్సార్ పింఛన్ పథకం కింద రూ.2,750 వితంతు పింఛన్ వస్తోంది. 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద నాలుగేళ్లకు రూ.64,712 బ్యాంకు రుణం మాఫీ అయ్యింది. 'సున్నా' వడ్డీ కింద రూ.11,400 అందింది. డిగ్రీ చదివిన నా చిన్న కుమారుడు డీ వన్నూరువలికి 'జగనన్న విద్యాదీవెన' కింద రూ.60 వేలు వచ్చింది. మొత్తంగా ప్రభుత్వం నుంచి రూ. 1,36,112 లబ్ధి చేకూరింది. సంఘం తరఫున బ్యాంకు అప్పు రూ. లక్ష, అంతర్గత అప్పు కింద రూ.లక్ష ఇచ్చారు. మా కుటుంబానికి దారి చూపిన సీఎం జగన్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటాం.

– డీ ఫక్రుబీ, శ్రీ సత్యసాయి మహిళాసంఘం, పామిడి

నలుగురికి ఉపాధినిస్తున్నా



20 ఏళ్లుగా డ్వాక్రా సభ్యురాలిగా ఉన్నా. గత ప్రభుత్వ హయాంలో సంఘాలకు సరైన ప్రోత్సాహం లేక అప్పుల పాలయ్యా. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో సొంతంగా చక్లీలు, నిప్పట్లు తయారు చేసే మిషన్‌ను బ్యాంకు రుణం ద్వారా ఏర్పాటు చేసుకున్నా. చక్లీలు, నిప్పట్ల ప్యాకింగ్ కోసం నలుగురిని పెట్టుకున్నా. దీంతో పాటు డ్వాక్రా సంఘంలోనే స్త్రీనిధి రుణం పొందా. సున్నావడ్డీతో పాటు ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.60 వేల వరకూ మాఫీ అయింది.

– సరస్వతీ, ఈశ్వరీ మహిళా సంఘం, ఉరవకొండ

పెద్ద కొడుకులా అండగా ఉన్నారు



పెద్దమ్మ తల్లి సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. 'వైఎస్సార్ ఆసరా' ద్వారా రూ.40 వేలు అందింది. మా సంఘానికి నాలుగు విడతల్లో రూ.4 లక్షలను ప్రభుత్వం అందించింది. ప్రభుత్వం అందించిన డబ్బుతో గ్రామంలోనే చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నా. 'వైఎస్సార్ ఆసరా'తో పాటు 'వైఎస్సార్ చేయూత' కింద నాకు లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి పెద్ద కొడుకులా మాకు అండగా ఉన్నారు.

– పెద్దక్క, చింతకుంట గ్రామం, పుట్లూరు మండలం

మేలు మరువం..



పామిడి పంచాయతీలోని శివసాయి మహిళా సంఘంలో 17 ఏళ్లుగా సభ్యురాలిగా కొనసాగుతున్నా. 2014లో నా భర్త శంకరరావు చనిపోయాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 'వైఎస్సార్ ఆసరా' కింద సంఘం నుంచి రూ.80 వేల బ్యాంకు రుణం పొందా. స్థానిక కల్యాణ మండపం కాంప్లెక్స్‌లో ఓ గది అద్దెకు తీసుకొని జనరల్ స్టోర్ పెట్టుకున్నా. పెట్టుబడి పోనూ రోజుకు రూ.500 ఆర్జిస్తున్నా. సున్నా వడ్డీ కింద రూ.11 వేలు అందింది. వైఎస్సార్ వితంతు పింఛన్ రూ. 2,750 వస్తోంది. ఇటీవలే సంఘం ద్వారా పొందిన డబ్బుతో ముగ్గురు కుమార్తెలు, కుమారుని పెళ్లి చేశా. మా కుటుంబానికి ఇంత మేలు చేసిన సీఎం జగన్‌ను ఎన్నటికీ మరువలేం.

– కే లక్ష్మిబాయి, శివసాయి మహిళా సంఘం, పామిడి

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతురాలు నారాయణమ్మ (ఫైల్)

నల్లమాడ: యర్రవంకపల్లికి చెందిన వీ.నారాయణమ్మ (50) శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపిన మేరకు.. నారాయణమ్మ ఇంటిముందు కాంపౌండ్‌లో విద్యుత్ మోటార్ ఆన్‌చేసి సంప్(నీటి గుంత)కు నీరు పడుతోంది. ఇదే సమయంలో కాంపౌండ్‌లోనే ఆమె బట్టలు కూడా ఉతుకుతున్నట్లు సమాచారం. ఆ సమయంలో విద్యుత్ మోటారుకు అమర్చిన విద్యుత్ వైరు నేలపై పడింది. కిందపడిన వైరును తీసి పక్కన ఉంచే ఉద్దేశంతో ఆమె విద్యుత్ వైరును పట్టుకొంది. విద్యుత్ వైరుకు అతుకులు (జాయింట్లు) ఉండటంతో షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గుర్తించిన తండావాసులు, సమీప బంధువులు చికిత్స నిమిత్తం 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త బాలాజీ నాయక్ కేరళలో వంట మాస్టరుగా పనిచేస్తున్నారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన ఆయన శుక్రవారం కేరళకు వెళ్లాడు. ఇంతలోనే భార్య మృతిచెందినట్లు సమాచారం అందడంతో ఆయన స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉండగా వారు అనంతపురంలో నివాసం ఉంటున్నారు. మృతురాలి పెద్ద కుమారుడు శ్రావణ్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడిగా టీ. పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీ. తిమ్మారెడ్డిని, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బి. రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి. చంద్రశేఖర్ రెడ్డిని ఎన్నుకున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా పీఆర్టీయూ సమన్వయ కర్త ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు.

ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రగ్బీ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ బాలుర జట్టు



ఎంపికైన ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ బాలికల జట్టు

హిందూపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. శనివారం పట్టణంలోని పోలీస్ గ్రౌండ్స్‌లో జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, ఇండియన్ ఆర్మీలో హ్యాండ్‌బాల్ ప్లేయర్ బాబా, ఈసీ మెంబర్ జులారెడ్డి సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలిక జట్టుకు యశ్వంతి, యమున, ఇందూ, చైతన్య, లిఖిత, నిత్యశ్రీ, పావని, లావణ్య, మేఘన, లలిత, వనజ, హీనా ఎంపికయ్యారు. ఈ జట్టు మేనేజర్‌గా రూప వ్యవహరించనున్నారు. అలాగే బాలుర జట్టుకు శ్రీసాయికృష్ణ, సందీప్, రాహుల్, మనోజ్, మహీధర్, సంతోష్ కుమార్, భాను తేజ, దత్త, అనిల్ కుమార్, కళ్యాణ్, సునీల్ ఎంపికయ్యారు. జట్టుకు మేనేజర్‌గా మల్లికార్జున వ్యవహరించనున్నారు. ఎంపికైన జట్లు విశాఖపట్నంలోని భీమిలీ సన్ స్కూల్‌లో ఫిబ్రవరి 3, 4, 5వ తేదీల్లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని రగ్బీ సంఘ కార్యదర్శి యాసిన్ మాలిక్, జాయింట్ సెక్రటరీ షౌకత్, రగ్బీ సంఘ డైరెక్టర్ ముస్తఫా కమల్ బాషా తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు రూప, అశ్విని, ఉదయ్, మల్లికార్జున, వెంకటేష్, సంఘ ట్రెజరర్ ముస్తకింలు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ ఆంధ్ర యూనివర్సిటీ & ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి B.A, B.Com, B.Sc, (TM/EM) (All Groups), M.A, M.Com, M.Sc (All Subjects) M.B.A, M.S.W, B.Li.Sc, M.Li.Sc. డా॥ బి. మధుసూధన. ఫోన్ : 83282 79245. [V- 6379]

EDUCATION

■ One Sitting Degree, PG, B.Tech, M.Tech, MBA, MCA, B.Sc Nursing, ANM, GNM, Pharmacy. Contact: 81435 83986 [L-806351]

EDUCATION

■ ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు గ్రామీణ నిరుద్యోగ యువతి యువకులకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar Skill Education, Kadapa. Ph: 9063082227, 9966448807 [C-1249531]

REAL ESTATE

NEW HOUSE FOR SALE

■ ATP, KLD రోడ్ దగ్గరలో, బాలాజీ విల్లాస్ ఎంట్రెన్స్ ఎదురుగా డబుల్ బెడ్ రూమ్ (POP & ఉడ్‌వర్క్) కార్ పార్కింగ్, విత్ బోర్, తూర్పు ఫేస్ కొత్త ఇల్లు అమ్మబడును. 7013588435. [A-2796]

FOR RENT

■ Most suitable commercial space for Clinic, Lab, Study Hall, Private Offices etc for Rent. Near Divyasree Hospitals, Adimurthy Nagar, ATP. Ph: 8639325680. [A-7396]

■ ATP, సాయి నగర్ మెయిన్ రోడ్ నందు, 800 చ.అ. కమర్షియల్ స్పేస్, సెల్లార్ ఫ్లోర్ లో బాడుగకు కలదు. ఫైనాన్స్, చిట్స్, ఏజెన్సీ ఆఫీస్‌లకు అనువైనది. సెల్ : 99490 59834. [A-1533]

ప్లాటు అమ్మబడును

■ అనంతపురము టౌన్, కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకావిల్లాస్ వెనుక రాచానపల్లి పొలం తిరుమలనగర్ సర్వే నెం. 144 ప్రస్తుతం ఇల్లు కట్టుకొను స్థలం 4 సెంట్లు (58x30) ప్లాటు అమ్మబడును. నోబ్రోకర్స్. సెల్ : 6281267589. [A-1189]

TOLET

■ అనంతపురము, రుద్రంపేట, మేథ హాస్పిటల్ ఎదురుగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో 1 BHK ఇల్లు నీటి వసతితో అద్దెకు కలదు. ఫోన్ : 92916 40096. [A-784530]

LAND FOR SALE

■ ఊటీలో అగ్రికల్చర్ ల్యాండ్స్ కొనండి మరియు ప్రతి సంవత్సరం ఎకరానికి 10 లక్షలు, టాక్స్ లేని లీజు ఆదాయం పొందండి. www.ootylands.com ఫోన్: 9944131155 [HA-14062]

స్థలం అమ్మబడును

■ 20 Cents కార్నర్ Plot నందు 30000 sq.ft. నిర్మింపబడి నెలకు 3 ½ లక్షల బాడుగ వచ్చుచున్న 5 అంతస్తుల బిల్డింగ్ Housing bard (New Rev Col) నందు అమ్మకమునకు కలదు. ఫోన్ : 94405 66667. [A-7391]

FLAT FOR SALE

■ Flat No: 302, SLV Concorde, Third cross left, Seven hills colony, Vidyut Nagar, Anantapur- 515001. 1050 Sq.ft area, well ventilated amazing balcony view with good infrastructure and Amenities. Ready to occupation. Contact Number: 9908790887. [A-7397]

FLATS FOR SALE

■ అనంతపురము, ఆలమూరు AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ GMR కాలనీలో కొత్త విల్లా ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రదించండి : 9121510333, 9392183377, 9281024684. [A-1545]

■ రాప్తాడు, బెంగళూరు హైవే AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ PLEASANT VALLEY లో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1546]

■ A.P. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ హంపాపురం ప్రక్కన NH44 వద్ద AHUDA ఆమోదిత లేఅవుట్ మహతిగ్రూప్ హైవే కౌంటీలో కొత్త ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1547]

SERVICES

BUSINESS OFFER

■ Call centre Service మీ రాజకీయ మరియు వ్యాపార అభివృద్ధి కొరకు సంప్రదించండి. ఫోన్: 8885056571. [H-801655]

WANTED

■ జూనియర్ కాలేజి కొరకు మండలాల వారీగా Admission PRO లు కావలెను. సెల్ : 8341729797. [A-7204]

■ మా హోమ్ కొరకు స్త్రీలు కేర్ టేకర్స్, జీ : 10-15 వేలు & సెక్యూరిటీ గార్డ్స్, వాలంటీర్లు - 20 మంది. జీ : 8 వేలు + వసతి + భోజనం ఫ్రీ. ATP. సెల్ : 9010887993 [A-784533]

■ గ్రీన్ ఎనర్జీ సోలార్ కంపెనీ,కళ్యాణ దుర్గం కదిరి దేవరపల్లిలో పనిచేయు టకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.జీతం: 17,000/-, డ్యూటీ: 12 గం.,Q: 10th, 8978996744. [T-1258793]

■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవ చేయుటకు, బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765 [H-788136]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ Wanted: Experienced Famale Staff for Maths, EVS subjects for primary classes in Blossoms School, ATP. Cell: 9030777676 [C-777485]

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B-623]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233763]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. ✆ 6301053500, 92814 52828 [B-1255426]

■ తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, మండలంలో ప్రతి గ్రామంలో ఒకరు రియల్ ఎస్టేట్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతము + కమీషన్ + ఇన్సెంటివ్ + Daily Allowance ఇవ్వబడును. (Conditions Apply) Contact: 9490763299, 7993243555. [L-806335]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం


పిల్లలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: పిల్లల ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ సుబ్బర హేమలత సూచించారు. శనివారం స్థానిక సచివాలయంలో పిల్లలకు టీకా వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, సుభద్రమ్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆత్మకూరు క్రికెట్ జట్టు జిల్లా స్థాయికి ఎంపికయ్యింది. నియోజకవర్గ స్థాయి క్రీడలు శనివారంతో ముగియడంతో ఆత్మకూరు క్రికెట్ జట్టు జిల్లా స్థాయికి , రన్నర్స్‌గా కబడ్డీ జట్టు, బాయ్స్ బ్యాడ్మింటన్‌లో మూడోస్థానం, ఉమెన్ బ్యాడ్మింటన్‌లో రన్నర్స్‌గా నిలిచినట్లు పీడీలు తెలిపారు. వచ్చేనెల 1 నుంచి జిల్లా స్థాయిలో ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో ఈ టీములు పాల్గొంటాయని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఎంపీడీఓ రఘునాథ్, ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, పీడీలు నాగరాజు, జగదీష్, సునీత, భరత్ అభినందించారు.

నాగేశ్వరరెడ్డికి సన్మానం


జిల్లా టూరిజం అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లా టూరిజానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నాగేశ్వరరెడ్డిని ప్రభుత్వం గుర్తించి ఉత్తమ అధికారిగా గౌరవించడం హర్షణీయమని జిల్లా పురావస్తుశాఖ సహాయ సంచాలకురాలు రజిత అన్నారు. శనివారం కోర్టురోడ్డులోని పీస్ మెమోరియల్ హాలులో టూరిజం శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన మ్యూజియం శాఖ టైపిస్టు నరేష్‌ను పురావస్తు శాఖ సిబ్బంది సన్మానించారు. అనంతరం ఏడీ రజిత, మ్యూజియం సిబ్బంది శ్వేతవాహన, అనిల్ సత్కరించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: ఫిబ్రవరి 5 నుంచి జరగనున్న ప్రాక్టికల్స్‌కు డబ్బు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని చైతన్య కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2 వేలకు పైగా వసూలు చేస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు భీమేష్,నగర ఉపాధ్యక్షుడు సోము పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- నగరంలోని ప్రారంభమైన 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ'


'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'లో వృద్ధురాలికి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, మరోసారి వైఎస్సార్‌సీపీ గెలిపించుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 9వ డివిజన్‌లోని శ్రీకృష్ణదేవరాయ నగర్, భవానీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆ నగర్లలోని ప్రతి గడపకూ వెళ్లి వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో ప్రజలకు చేసిన రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్ల అభివృద్ధి పనుల కరపత్రాలు అందించారు. అమ్మ ఒడి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన-వసతి దీవెన రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.89.98 కోట్లు, వైస్సార్ ఆసరా రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.403.98 కోట్లు, కాపు నేస్తం రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.11.78 కోట్లు, సున్నావడ్డీ రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.311 కోట్లతో అర్బన్ లింక్ వైడనింగ్, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, ఎస్‌క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కరోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి, రూ43 కోట్లతో ఏ నారాయణపురంలో అభివృద్ధి పనులు, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీ అభివృద్ధి, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

పేదవాడికి కార్పొరేట్ వైద్యం:

తమ ప్రభుత్వంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చి, పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు స్పెషాలిటీ వైద్యాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో నాడు-నేడు కింద రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణకు సంబంధించి ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్, హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్లు నగరాభివృద్ధిని విస్మరించి, కేవలం డివైడర్లకు మాత్రమే పరిమితమయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరుగునపెట్టేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. కోవిడ్‌తో రెండేళ్లు గడిచి పోయినా..మిగితా రెండున్నరేళ్లలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేపట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ సీనియర్ నాయకులు అనంతచంద్రారెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు ఎం.దేవి, లక్ష్మిదేవి, సుమతి, శేఖర్ బాబు, సాకే చంద్ర, బాలాంజనేయులు, చంద్రమోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, కోఆప్షన్ షంషుద్దీన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, కృష్ణవేణి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రనాయుడు, నాయకులు కృష్ణమూర్తి, చింతకుంట మధు, రామయ్య, రాధాకృష్ణ, లక్ష్మిరెడ్డి, వనారస బలరాం, హనుమంతు, లక్ష్మణ్, రాధా యాదవ్, భారతి, దేవి, పార్వతి, శోభారాణి పాల్గొన్నారు.

నేడు భవానీనగర్‌లో...

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం భవానీనగర్‌లో ఆదివారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. భవానీనగర్ పైప్‌లైన్ రోడ్డు ఆటోస్టాండ్ నుంచి కార్యక్రమం

సమన్వయంతో సమగ్రాభివృద్ధి సాధిద్దాం


జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈఓ నిధియాదేవి

అనంతపురం సిటీ: పరస్పర సహకారం, సమన్వయంతో పని చేసి ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. జెడ్పీ సీఈఓగా నియమితులైన వైభోమ్ నిధియాదేవి బాధ్యతలు చేపట్టాక శనివారం తొలిసారి జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, జిల్లాలో భౌగోళిక పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి, జెడ్పీ కార్యాలయ ప్రక్షాళన తదితర అంశాలపై చర్చించారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.కోట్లతో జరుగుతున్న పనులు గడువులోపు పూర్తి చేసి, ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారని గిరిజమ్మ తెలిపారు. రానున్న రోజులు కీలకం కావడంతో మరింత సమర్థవంతంగా పని చేసి, జిల్లాను అభివృద్ధి పరంగా అగ్రభాగాన నిలబెడదామని గిరిజమ్మ కోరారు.

ఆర్జేడీని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు


ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డికి బొకే అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నేతలు ఓబుళపతి, గిరిధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలపై విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డిని కడప కార్యాలయంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు శనివారం కలిశారు. ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. ఓబుళపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హెచ్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా ప్రసాద్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీల సమస్యలు పరిష్కరించారని, ఉపాధ్యాయుల సమస్యలూ పరిష్కరించాలని కోరారు. సర్వీస్ మ్యాటర్స్‌ను సకాలంలో పూర్తి చేసే విధంగా రీజనల్ పరిధిలోని జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఓబుళపతి కోరారు. ఆర్జేడీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

పోతప్పకట్ట ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు ప్రారంభం


ఆత్మకూరులోని పోతప్ప కట్ట వద్ద జరుగుతున్న నీటి ట్యాంకు పనులు చూపుతున్న స్థానికులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పోతప్పకట్ట, ఓసీ కాలనీల్లో ఉన్న నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేశారని ఓసీ కాలనీవాసులు, పోతప్పకట్ట వాసులు తెలిపారు. శనివారం పోతప్ప కట్ట వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను ప్రారంభించారు. 90 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును ఏర్పాటు చేయిస్తున్నందుకు ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఏబీఆర్ డ్యాం నుంచి పైప్‌లైన్ పనుల్లో భాగంగా ఈ ట్యాంకు ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్ తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ నీటి సమస్య ఉందని చాలా సార్లు గతంలో ధర్నాలు చేశామని, పొలాల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చేదన్నారు. పైప్ లైన్ పనులు, ఓవర్‌హెడ్ ట్యాంకు పూర్తయితే నీటి సమస్య తీరుతుందని ఇచ్చిన మాట ప్రకాష్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, నాయకులు జయరాంరెడ్డి,కాలనీవాసులు దామోదర్‌రెడ్డి, పుల్లారెడ్డి, జగదీశ్వరరెడ్డి, వెంకటారమిరెడ్డి, దాదావలి, మాబు,కొండారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు బాధితులకు శస్త్రచికిత్సలు చేయించాలి


మాట్లాడుతున్న కుష్టు విభాగం జిల్లా అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం మెడికల్: కుష్టుతో అంగవైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, శస్త్రచికిత్సలు చేయించాలని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కుష్టు వ్యాధి విభాగం అధికారులు, సిబ్బందితో డాక్టర్ అనుపమ జేమ్స్ సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష - 2 కార్యక్రమంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ గంగాధర్ రెడ్డి, డాక్టర్ శివారెడ్డి, పారా మెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారా మెడికల్ అధికారి

నేడు ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ సంస్మరణ సభ

అనంతపురం కల్చరల్: ప్రతిష్టాత్మక ఉమ్మడిశెట్టి అవార్డు వ్యవస్థాపకుల్లో ఒకరైన ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ సంస్మరణ సభ ఆదివారం జరగనుంది. ఈ మేరకు సీనియర్ సాహితీవేత్త డాక్టర్ రాధేయ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రెవెన్యూకాలనీ సమీపంలోని షిర్డీనగర్‌లోని ఉమ్మడిశెట్టి రాధేయ స్వగృహంలో సాయంత్రం 5 గంటలకు సంతాప సభ జరుగుతుంద

ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ఇష్టపడి చదివితేనే సత్ఫలితాలు సాధించొచ్చని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. శనివారం ఆదిమూర్తి నగర్‌లోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. పదో తరగతి పరీక్షలపై ఆందోళన చెందకుండా ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి సుభాషిణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కళ్యాణి పాల్గొన్నారు.

రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీతను అభినందించిన ఎంపీ


రాగే సూర్యప్రసాద్‌ను అభినందించిన ఎంపీ డా. తలారి రంగయ్య

శెట్టూరు: కిలిమంజోరా పర్వత శిఖరాన్ని అధిరోహించి రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీత రాగే సూర్యప్రసాద్‌ను అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అభినందించారు. అనంతపురం నగరానికి చెందిన రాగే సూర్యప్రసాద్ అతి చిన్న వయస్సులో కిలిమంజోరా పర్వతాన్ని అధిరోహించని విషయం తెలిసిందే. ఎంపీ మాట్లాడుతూ ఏటా అందించే బాల పురస్కార్ అవార్డు అనంతపురం బాలుడికి దక్కడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో పర్వతాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, జెడ్పీటీసీ మంజునాథ, మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస


కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ బెంజిమన్


ఐలండ్ పీఆర్ పీఆర్ఓ సూర్య నారాయణరెడ్డి


ఐలండ్ పీఆర్ ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్ ఎండీ కమల్


కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ గన్‌మెన్ మురళీ

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు గణతంత్ర దిన వేడుకల సందర్భంగా కలెక్టర్ ఎం.గౌతమి ప్రశంసా పత్రాలను అందజేశారు. శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉద్యోగులు ఈ అవార్డులను అందుకున్నారు.



బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా క్రింద వివరించిన షెడ్యూల్ దాఖలా ఆస్తి మా క్లయింట్స్ అయిన యం. రఘునాథ్, యం.మల్లికార్జున, కె. గాయత్రి, యం. వినోద్ హక్కు కలిగి స్వాధీనంలో ఉన్నారు. అదే విషయమై II Junior Civil Judge (Mobile) Court, Ananthapur నందు O.S. No. 42/2024 దావా కింద [illegible]

SCHEDULE

House site property situated in Anantapur Municipal Limits in SRD & RD of Ananthapur District.

[illegible]

Present-12 267/3 3.79 paiki 1.89 A.C. H.S. Plot No 4.94 paiki 0.06¼ 0.025 36

Boundaries : East : Plot No. 46; South : Plot No. 37; West : 33 Feet Road ; North : 40 Feet Road.

Measurements : East-West : 67 Feet or 20.42 Meter ; North-South : 40 Feet or 12.19 Meter; Total : 297.77 Square Yards.

యం.బి. సిరాజుద్దీన్, B.Sc., LL.M., (Ph.D.) అడ్వకేట్, అనంతపురము. Cell : 9885992991

ఖరీదైన పైపులు గల్లంతు

- రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల సమయంలో పైపులు తొలగింపు
- తిరిగి ఏర్పాటు చేయని ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్


పనులు జరిగే సమయంలో తొలగించిన పైపులు ఇవే

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు చెందిన ఖరీదైన పైపులు కనిపించలేదు. గతేడాది రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల సమయంలో పీటీసీ సమీపంలో డిస్ట్రిబ్యూషన్ పైపులను ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్వాహకులు తొలగించారు. ఇంత వరకూ వాటిని తిరిగి ఏర్పాటు చేయలేదన్న విమర్శలున్నాయి. 2021 అక్టోబర్‌లో రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు జరిగాయి. ఆ సమయంలో నడిమివంక నుంచి పీటీసీ వైపుగా రోడ్డు విస్తరణలో భాగంగా నిర్వాహకులు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్‌ను తొలగించి, తిరిగి ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతానికి ఈ పైప్‌లైన్‌తో అవసరం లేకున్నా, భవిష్యత్తులో పైప్‌లైన్ ఆవశ్యకత తప్పనిసరి. ఇదెలా ఉన్నా జోనల్ 30 పరిధిలో డీ1 కే7 100ఎంఎం డైయా పైప్ 300 మీటర్ల పొడవు (వీటి విలువ రూ.4,32,957), మెయిన్ పైప్ డీ1 కే9 200 ఎంఎం డయా పైప్ 536.5 మీటర్ల పొడవు (వీటి విలువ రూ.18,25,763), నాలుగు గ్రావిటీ పైప్‌లు మీటర్ పొడవు (వాటి విలువ రూ.47,000) ఉన్న పైప్‌లు కనిపించలేదు. రూ.లక్షలు విలువ చేసే పైపులు కనిపించకపోయినా నగరపాలక సంస్థ ఇంజినీర్లు పట్టించుకోలేదు. ఇదే విషయమై పలువురు ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీయగా, తమకేమీ తెలియదని దాటవేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కాశీవిశ్వేశ్వరాలయానికి పెరిగిన ఆదాయం

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరాలయానికి గతంలో కన్నా టెంకాయల వేలంలో రూ. 24,500 అదనపు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రమేష్ బాబు అన్నారు. శనివారం స్థానిక మొదటి రోడ్డులోని శివాలయంలో దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. నగరానికి చెందిన డి.వెంకటరమణ అనే భక్తుడు వేలంలో అత్యధిక మొత్తం రూ.51 వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కార్యనిర్వహణధికారి సాకే రమేష్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యుడు నీలూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకేలో సైన్స్ ఎగ్జిబిషన్ రేపు

అనంతపురం రూరల్: పీవీకేకే ఐటీ డిప్లమా కళాశాలలో ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు స్వాద్యాయ 2024 పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 9,10 వ తరగతుల విద్యార్థులతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేసీ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరవుతారన్నారు.

కోవూరు నగర్‌లో అల్లరిమూకలు

అనంతపురం క్రైం: నగరంలోని కోవూరునగర్‌లోని పార్కు వద్ద అల్లరిమూకలు పోగై స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సాయంత్రం తర్వాత చీకటి పడిందంటే చాలు వచ్చి పోయే వారిని ఇబ్బందులు పెడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ట్యూషన్ల నుంచి ఇంటికి వెళ్లే దారిలో పార్కు ముందు కూర్చొని అక్కడ కాపు కాసి వెకిలి చేష్టలు చేస్తున్నారని స్థానికులు వాపోయారు. పార్కు గోడ కింద కూర్చొని పిల్లలను పిలిచి అమ్మాయిలకు లెటర్లు ఇవ్వాలని బెదిరిస్తున్నారని తెలిపారు. శనివారం సాక్షి కార్యాలయానికి వచ్చిన స్థానికులు ఈ ప్రాంతంలో షీ టీమ్‌లను ఏర్పాటు చేసి యువతులు, మహిళలకు రక్షణగా నిలవాలని వారు కోరారు.

టీచర్ల పీఎఫ్ బకాయిలు చెల్లించేలా చూడండి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ 2009కు ముందు ఉపాధ్యాయుల పీఎఫ్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ (1938) జిల్లా గౌరవ అధ్యక్షుడు రామానాయక్, నగర శాఖ అధ్యక్షుడు అశోక్ నాయక్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ ఖాన్, నాయకులు రఘునాథ్, రామాంజులు, లోకయ్య, తిరుపాల్ నాయక్, నాగేంద్ర, జయరాంనాయక్, బాలాజీ నాయక్, కాంతిరాజ్, విజయలక్ష్మి, పూర్ణమ్మ, కరుణ జ్యోతి, కృష్ణవేణి, సునీత, సరస్వతి, హేమలత ఉన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 30న అవగాహన సదస్సు

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని స్థలాల లీజుపై ఈనెల 30న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎం కార్యాలయానికి ఉత్తర దిశగా ఉన్న ఖాళీ స్థలాన్ని 33 ఏళ్ల కాలపరిమితితో లీజుకు ఇవ్వడంపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 4,330 చదరపు గజాలు, 3,845 గజాలుగా రెండుగా విభజించినట్లు తెలిపారు.

ఫార్మసీతో అవకాశాలు అపారం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు


ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అనంతపురం: ఫార్మసీతో అవకాశాలు అపారమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. శనివారం ఓటీపీఆర్ఐలో 2023 బ్యాచ్ బీఫార్మసీ విద్యార్థులకు స్వాగతోత్సవం (ఫ్రెషర్స్ డే) నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఫార్మసీ గొప్పతనాన్ని వివరించారు. బీఫార్మసీ పూర్తి చేసిన వారు సమాజంలో నిర్వర్తించాల్సిన పాత్రను తెలియజేశారు. ఎప్పటికప్పుడు నూతన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారుడయిన టి. పరంధామరెడ్డి తండ్రి తిప్పిరెడ్డి గారి రెడ్డి రాజప్ప, ఖానుకోట గ్రామం, కనగానపల్లి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని డాక్యుమెంట్ నెం. 6433/1986, 22-07-1986వ తేదీన యం. వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి, కోర్టు రోడ్డు, అనంతపురము గారిచే కొనుగోలు చేసి రిజిస్టరు పొంది ఉన్నారు. అందులకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మా కక్షిదారునికి తప్ప ఇతరులకు ఎటువంటి హక్కులు లేవు మరియు నా కక్షిదారుని స్వాధీనానుభవములో ఉన్నది. అందులకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరైన ఎటువంటి లావాదేవీలు కానీ, క్రయ విక్రయాలు కానీ, ఏ ఇతరత్రా జరిపిన అవి చట్టరీత్యా చెల్లనేరవు ఒకవేళ ఎవరైన అతిక్రమించినచో అటువంటి వారిపైన మా కక్షిదారుడు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెల్పడమైనది.

షెడ్యూలు

అనంతపురము రి॥డి॥ అనంతపురము సబ్॥డి॥కు చేరిన కక్కలపల్లి గ్రామపొలం సదరి పంచాయితీ ఏరియాలోని ఆస్తి వివరం.

బాబు : సర్కారు ఖుష్కి, సర్వే నెం. 7, ఎ.సి : 14.26 పైకి, ఎ.సి : 0.05, హెచ్.యస్. : 0.020 పైకి ప్లాటు నెం.108 బి గ్రూపు. చెక్కుబంది : తూర్పు : 104 నెంబరు ప్లాటు; దక్షిణం : ఇదే సర్వే నెంబరులో మిగతా జమీను; పడమర :102 నెంబరు ప్లాటు, ఉత్తరం : రోడ్డు.

N.R.K. MOHAN, Advocate,
Anantapuramu. Cell : 9440787100









క్వార్టర్ ఫైనల్లో శ్రీజ పరాజయం

వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడా కారిణుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన జాతీయ మాజీ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. గోవాలో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీజ 5-11, 11-7, 6-11, 4-11తో చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. శ్రీజకు 2,500 డాలర్ల (రూ. 2 లక్షలు) ప్రైజ్‌మనీ, 105 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



నేడు అమెరికాతో యువ భారత్ 'ఢీ'

అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఉదయ్ సహారణ్ నాయకత్వంలోని టీమిండియా నేడు గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికా జట్టుతో తలపడనుంది. తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, ఐర్లాండ్‌పై గెలిచి 'సూపర్ సిక్స్' బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్ ఈ మ్యాచ్‌లోనూ గెలిచి లీగ్ దశను అజేయంగా ముగించాలని పట్టుదలతో ఉంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



పోప్

పోప్ సెంచరీ తాలింపు...

శతకంతో చెలరేగిన ఒలీ పోప్ ● రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 316/6

ప్రస్తుతం 126 పరుగులు ముందంజలో ● తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 436 ఆలౌట్

తొలి టెస్టు మూడో రోజు ఆట మొదలైనప్పుడు భారత్ 175 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమ్ ఆలౌట్ అయ్యే సమయానికి ఆ ఆధిక్యం 190 పరుగులకు చేరింది. ముందుగా ఈ లోటును పూడ్చుకునే ప్రయత్నంలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసేసరికి 126 పరుగులు ముందంజలో నిలిచింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ బ్యాటర్ల పోరాటం జట్టును ఇక్కడి వరకు తీసుకొచ్చింది. ముఖ్యంగా ఒలీ పోప్ అద్భుత బ్యాటింగ్‌తో చిరస్మరణీయ ప్రదర్శన చేశాడు. ఈ ఇన్నింగ్స్‌కు ముందు భారత గడ్డపై 9 ఇన్నింగ్స్‌లలో కలిపి 154 పరుగులే చేసిన పోప్ ఈ ఇన్నింగ్స్‌లోనే దాదాపు అన్నే పరుగులు సాధించడం విశేషం. అతని స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లకు భారత స్పిన్నర్ల వద్ద జవాబు లేకపోయింది. ఆధిక్యం మరీ ఎక్కువ కాదు కాబట్టి ఈ మ్యాచ్ ఇంకా టీమిండియా చేతుల్లోనే ఉంది. అయితే మారిపోతున్న పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్ సవాల్‌ను రోహిత్ బృందం ఎంత సమర్థంగా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం.



సాక్షి, హైదరాబాద్: భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఓటమి ఖాయమనిపించే స్థితి నుంచి కోలుకొని ఇంకా పోరాడుతోంది. శనివారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఒలీ పోప్ (208 బంతుల్లో 148 బ్యాటింగ్; 17 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 126 పరుగులు ముందంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 421/7తో ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 121 ఓవర్లలో 436 పరుగులకు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (180 బంతుల్లో 87; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు.

మరో 15 పరుగులు జోడించి...

మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసేందుకు 11 ఓవర్లు సరిపోయాయి. ఒకేస్కోరు వద్ద జట్టు చివరి 3 వికెట్లు కోల్పోయింది. రూట్ వరుస బంతుల్లో జడేజా, బుమ్రా (0)లను అవుట్ చేయగా... తర్వాతి ఓవర్లో అక్షర్ పటేల్ (100 బంతుల్లో 44; 7 ఫోర్లు, 1 సిక్స్)ను రేహాన్ బౌల్డ్ చేశాడు.

రాణించిన డకెట్...

తొలి ఇన్నింగ్స్‌లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లండ్ శుభారంభం చేసింది. క్రాలీ (33 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్), డకెట్ కలిసి చకచకా పరుగులు జోడించారు. అశ్విన్ చక్కటి బంతితో క్రాలీని అవుట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీసినా... డకెట్, పోప్ జోరుగా ఆడటంతో తొలి సెషన్ ముగిసేసరికి జట్టు 6 రన్‌రేట్‌తో 15 ఓవర్లలోనే 89 పరుగులు చేసింది. అయితే లంచ్ తర్వాత భారత బౌలర్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. బుమ్రా బౌలింగ్‌లో డకెట్ ఎల్బీ అయ్యే అవకాశం ఉన్నా... భారత్ రివ్యూ తీసుకోకపోవడంతో అతను బతికిపోయాడు. రీప్లేలో బంతి స్టంప్స్‌ను తాకేదని తేలడంతో బుమ్రా తీవ్రంగా నిరాశ చెందాడు. అయితే తన తర్వాతి ఓవర్లో అద్భుత బంతితో డకెట్‌ను బౌల్డ్ చేసిన భారత పేసర్ భావోద్వేగం ప్రదర్శించాడు. జట్టు టాప్ బ్యాటర్ రూట్ (6 బంతుల్లో 2)ను కూడా తన తర్వాతి ఓవర్లోనే బుమ్రా అవుట్ చేశాడు. జడేజా బంతిని ఆడకుండా వదిలేసి బెయిర్‌స్టో (24 బంతుల్లో 10; 1 ఫోర్) బౌల్డ్ కాగా... బెన్ స్టోక్స్ (33 బంతుల్లో 6)కు వరుసగా మూడు ఓవర్లు మెయిడిన్ వేసి ఒత్తిడి పెంచిన అశ్విన్ అదే జోరులో చక్కటి బంతితో అతని ఆట కట్టించాడు. మరోవైపు పోప్ మాత్రం చక్కటి షాట్లతో పరుగులు రాబడుతూ 54 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

భారీ భాగస్వామ్యం...

స్టోక్స్ ఐదో వికెట్‌గా వెనుదిరిగినప్పుడు ఇంగ్లండ్ స్కోరు 163/5. ఆ జట్టు మరో 27 పరుగులు వెనుకబడి ఉంది. ఈ దశలో భారత్ మిగిలిన వికెట్లను టపటపా పడగొట్టి మ్యాచ్‌ను ముగిస్తుందని అనిపించింది. అయితే మరో 30 ఓవర్ల పాటు పోప్, బెన్ ఫోక్స్ (81 బంతుల్లో 34; 2 ఫోర్లు) కలిసి భారత బౌలర్లను ఆడుకున్నారు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబట్టారు. ఆరంభంలో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకున్న తర్వాత ధాటిగా ఆడారు. భారత బౌలర్లలోనూ ఎవరూ వీరిని ఇబ్బంది పెట్టలేకపోయారు. దాంతో ముందుగా తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చుకున్న ఇంగ్లండ్.. ఆ తర్వాత ఆధిపత్యాన్ని పెంచుకుంటూ పోయింది. ఈ క్రమంలో పోప్ 154 బంతుల్లో తన కెరీర్‌లో ఐదో టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆరో వికెట్‌కు పోప్‌తో 112 పరుగులు జత చేసిన ఫోక్స్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో భారత్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. అయితే రేహాన్ (31 బంతుల్లో 16 బ్యాటింగ్; 2 ఫోర్లు) కలిసి పోప్ మరో వికెట్ పడకుండా మూడో రోజును జాగ్రత్తగా ముగించాడు. చివరి సెషన్‌లో ఇంగ్లండ్ 35 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి 144 పరుగులు సాధించింది. 110 పరుగుల వద్ద పోప్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 436 ఆలౌట్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బ్యాటింగ్) 148; రూట్ (ఎల్బీ) (బి) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రేహాన్ (బ్యాటింగ్) 16; ఎక్స్‌ట్రాలు 22; మొత్తం (77 ఓవర్లలో 6 వికెట్లకు) 316. వికెట్ల పతనం: 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275. బౌలింగ్: బుమ్రా 12-3-29-2, అశ్విన్ 21-3-93-2, అక్షర్ 15-2-69-1, జడేజా 26-1-101-1, సిరాజ్ 3-0-8-0.



విన్నర్స్ ట్రోఫీతో బోపన్న, ఎబ్డెన్

'గ్రాండ్'సలామ్ బోపన్న...

సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న 'గ్రాండ్‌స్లామ్' పురుషుల డబుల్స్ టైటిల్ స్వప్నం సాకారమైంది. 61వ ప్రయత్నంలో బోపన్న ఈ ఘనత సాధించాడు. గత ఐదేళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన బోపన్న... ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి ఈసారి చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా బోపన్న (43 ఏళ్ల 329 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. నెదర్లాండ్స్ ప్లేయర్ జీన్ జూలియన్ రోజర్ (40 ఏళ్ల 9 నెలలు: 2022లో ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్) పేరిట ఉన్న ఈ రికార్డును బోపన్న బద్దలు కొట్టాడు. ఓవరాల్‌గా ఈ రికార్డు మార్టినా నవ్రతిలోవా (46 ఏళ్ల 261 రోజులు: 2003లో యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్) పేరిట ఉంది.

- 61వ ప్రయత్నంలో సాకారమైన గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ స్వప్నం
- 43 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ సొంతం
- టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన పెద్ద వయస్కుడిగా రికార్డు

మెల్‌బోర్న్: గత 17 ఏళ్లుగా రోహన్ బోపన్న చేస్తున్న అలుపెరుగని పోరాటానికి ప్రతిఫలం లభించింది. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. శనివారం జరిగిన ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (7/0), 7-5తో సిమోన్ బొలెలీ-ఆంద్రియా వవాసోరి (ఇటలీ) జోడీపై గెలిచింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట ఎనిమిది ఏస్‌లు సంధించింది. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో బోపన్న-ఎబ్డెన్ పూర్తి ఆధిపత్యం చలాయించారు. రెండో సెట్‌లోని 11వ గేమ్‌లో ఇటలీ జంట సర్వీస్‌ను బ్రేక్ చేసి 12వ గేమ్‌లో బోపన్న ద్వయం తమ సర్వీస్‌ను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకుంది. విజేతగా నిలిచిన బోపన్న-ఎబ్డెన్ జంటకు 7,30,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 3 కోట్ల 98 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

2003లో ప్రొఫెషనల్‌గా మారిన బోపన్న 2008లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగాడు. నాటి నుంచి ఇప్పటివరకు 61 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన బోపన్నకు పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందని ద్రాక్షలా మారింది. ఎట్టకేలకు 61వ ప్రయత్నంలో ఈ ఏడాది బోపన్న కల నెరవేరింది. పురుషుల డబుల్స్‌లో అతని ఖాతాలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. 2017లో బోపన్న కెనడా అమ్మాయి గాబ్రియేలా దబ్రౌస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. పురుషుల డబుల్స్‌లో బోపన్న 2013లో పాక్ ప్లేయర్ ఐజామ్ ఖురేషీతో యూఎస్ ఓపెన్‌లో... ఎబ్డెన్‌తో కలిసి 2023 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరాడు. అయితే ఈ రెండుసార్లూ బోపన్న జోడీ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. అయితే మూడో ప్రయత్నంలో బోపన్న విజయవంతమయ్యాడు. 'నా జీవితంలో అత్యంత మధురక్షణాలవి. రెండేళ్ల క్రితం వరుసగా ఐదు నెలలపాటు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేకపోయాను. దాంతో వీడ్కోలు పలికే సమయం వచ్చేసిందని భావించాను. అయితే నా నిరంతరశ్రమ, గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే బలీయమైన కాంక్ష నన్ను ఆటలో కొనసాగేలా చేసింది' అని బోపన్న వ్యాఖ్యానించాడు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి తర్వాత పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన మూడో భారతీయ ప్లేయర్‌గా బోపన్న నిలిచాడు. సోమవారం ఏటీపీ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న తొలిసారి వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నారు. ఈ ఘనత సాధించనున్న అతి పెద్ద వయస్కుడిగా బోపన్న రికార్డు సృష్టించనున్నాడు.

సబలెంకా... మళ్లీ చాంపియన్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న బెలారస్ స్టార్

ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో చైనా ప్లేయర్ జెంగ్ కిన్‌వెన్‌పై విజయం



సబలెంకా

మెల్‌బోర్న్: బెలారస్ టెన్నిస్ స్టార్, డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. వరుసగా రెండో ఏడాదీ మహిళల సింగిల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో రెండోసీడ్ సబలెంకా 76 నిమిషాల్లో 6-3, 6-2తో చైనాకు చెందిన 12వ సీడ్ జెంగ్ కిన్‌వెన్‌పై గెలిచింది. విజేత సబలెంకాకు 31,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 21 లక్షలు), రన్నరప్ జెంగ్ కిన్‌వెన్‌కు 17,25,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

తొలిసెట్‌లో రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకకు ఈ సెట్ గెలిచేందుకు ఎంతోసేపు పట్టలేదు. రెండో సెట్లోనూ రెండు బ్రేక్ పాయింట్లను సాధించిన 25 ఏళ్ల బెలారస్ స్టార్ ఈ మ్యాచ్‌లో 3 ఏస్‌లను సంధించి, 14 విన్నర్లు కొట్టింది. 14 అనవసర తప్పిదాలు చేసింది. ఒక్కసారి కూడా డబుల్‌ఫాల్ట్ చేయకుండా జాగ్రత్తగా ఆడింది. జెంగ్ 6 ఏస్‌లతో రాణించినప్పటికీ 6 డబుల్ ఫాల్ట్‌లు, 16 అనవసర తప్పిదాలతో టైటిల్‌కు దూరమైంది. గత 13 నెలల్లో ప్రతీ టోర్నీలోనూ మెరుగవుతున్న సబలెంకా జోరు ముందు ఏమాత్రం నిలువలేకపోయింది. గత సీజన్‌లో ఆరంభ గ్రాండ్‌స్లామ్ గెలిచిన బెలారస్ అమ్మాయి ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. మధ్యలో ఫ్రెంచ్, వింబుల్డన్ ఓపెన్‌లలోనూ సెమీఫైనల్ వరకు పోరాడింది. యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా చేతిలోనే ఓడి ఇంటిదారి పట్టిన 21 ఏళ్ల జెంగ్ కిన్‌వెన్ ఇప్పుడు ఆమె జోరుకు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. తద్వారా మళ్లీ ఈ ఏడాదీ కొత్త సీజన్‌కు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పిన సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అజరెంకా (2012, 2013) తర్వాత వరుస టైటిల్స్ గెలిచిన ప్లేయర్‌గా ఘనతకెక్కింది. 2000 తర్వాత సెట్ కోల్పోకుండా ఇక్కడ విజేతగా నిలిచిన ఐదో క్రీడాకారిణిగా సబలెంకా నిలిచింది.

రన్నరప్ భారత్

మస్కట్: మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ఇతిమరపు రజని కెప్టెన్సీలోని భారత జట్టు 2-7 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున జ్యోతి ఛత్రి (20వ ని.లో), రుతుజా (23వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యెండల సౌందర్య భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించింది.


హైదరాబాద్ భారీ విజయం

సాక్షి, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 529/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 59.3 ఓవర్లలో 615/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తన్మయ్ అగర్వాల్ (181 బంతుల్లో 366; 34 ఫోర్లు, 26 సిక్స్‌లు) తొందరగా అవుటయ్యాడు. 443 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన అరుణాచల్ ప్రదేశ్ 53.4 ఓవర్లలో 256 పరుగులకే కుప్పకూలింది.

ఆంధ్ర 431 ఆలౌట్

రంజీ ట్రోఫీ 'ఎలైట్' డివిజన్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 277/4తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర మరో 154 పరుగులు జతచేసింది. ఛత్తీస్‌గఢ్ ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 118 పరుగులు చేసింది.

సినిమా



రజనీకాంత్

విజయ్‌తో కాదు... నాతో నాకే పోటీ

''నాకు, విజయ్‌కు మధ్య పోటీ లేదు. తనకు తానే పోటీ అని విజయ్ అంటుంటాడు. నేనూ అంతే. నాకు పోటీ నేనే'' అన్నది రజనీకాంత్ లేటెస్ట్ స్టేట్మెంట్. 'లాల్‌సలామ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ ఈ విధంగా మాట్లాడారు. దీనికి ఓ కారణం ఉంది. 'జైలర్' సినిమా ఆడియో ఫంక్షన్ వేదికగా రజనీకాంత్ ఓ డేగ, కాకి కథ చెప్పారు. 'కాకులు ఎంత అరిచినా వాటి అరుపులు పట్టించుకోకుండా డేగ ఆకాశానికి ఎగురుతూనే ఉంటుంది' అంటూ తన జర్నీని ఉద్దేశించి ఆ కథ చెప్పారు రజనీ. దాంతో విజయ్‌ను ఉద్దేశించే ఆ కథ చెప్పారని కొందరు విజయ్ ఫ్యాన్స్, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకరమైన కామెంట్స్ చేశారు. ఈ విషయంపై తాజాగా చెన్నైలో జరిగిన 'లాల్ సలామ్' ఆడియో లాంచ్ వేదికగా రజనీకాంత్ స్పందించారు. ''జైలర్' ఫంక్షన్‌లో నేను చెప్పిన కథ తప్పుగా ప్రచారంలోకి వెళ్లింది. విజయ్‌ని ఉద్దేశించే నేను ఆ కథ చెప్పానని ప్రచారం జరగడం బాధగా అనిపించింది. 'ధర్మత్తిన్ తలైవన్' సినిమా షూటింగ్ టైమ్‌లో విజయ్ తండ్రి చంద్రశేఖర్ నాకు అతన్ని పరిచయం చేసి, విజయ్ నటనపట్ల ఆసక్తిగా ఉన్నాడని చెప్పారు. చదువు పూర్తి చేశాక ఇండస్ట్రీలోకి రావాలని విజయ్‌కి సలహా ఇచ్చాను. తన చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. ప్రతిభ, క్రమశిక్షణ, కష్టంతో విజయ్ పెద్ద స్టార్‌గా ఎదిగాడు. ఇకపై మా ఇద్దరి మధ్య పోటీ పెట్టొద్దని ఫ్యాన్స్‌ని కోరుతున్నాను'' అన్నారు. ఇక ఐశ్వర్య దర్శకత్వంలో రూపొందిన 'లాల్ సలామ్' ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది.



'భ్రమయుగం' పోస్టర్

ఆ రోజే భ్రమయుగం

మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న మలయాళ చిత్రం 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహిస్తున్నారు. చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్న ఈ సినిమా థియేటర్స్‌కి వచ్చే రోజు ఖరారైంది. ఫిబ్రవరి 15న ఈ చిత్రాన్ని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''హారర్-థ్రిల్లర్ జానర్‌లో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న చిత్రమిది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్.



బాబీ డియోల్

రూత్‌లెస్... పవర్‌ఫుల్

రూత్‌లెస్..పవర్‌ఫుల్..అన్‌ఫర్‌గెటబుల్... ఇవన్నీ ఒకరి గురించే. అతనే ఉధిరన్. 'కంగువ' సినిమాలో బాబీ డియోల్ పాత్ర పేరు 'ఉధిరన్'. జనవరి 27 బాబీ డియోల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కంగువ' సినిమాలో ఆయన పోషిస్తున్న ఉధిరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఫ్యాంటసీ ఫిల్మ్ ఇది. ఇందులో దిశా పటానీ హీరోయిన్‌గా, ఓ కీలక పాత్రలో బాబీ డియోల్ నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ పాన్ వరల్డ్ మూవీ పదికి పైగా భాషల్లో, త్రీడీలోనూ విడుదల కానుంది. ''ఉధిరన్‌గా యునిక్ మేకోవర్‌లో కనిపిస్తారు బాబీ డియోల్. యుద్ధానికి సిద్ధం అవుతున్న ఉధిరన్‌కు ఆయన ప్రజలు మద్దతు తెలుపుతున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశాం. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే... బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో బాబీ డియోల్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ శనివారం అధికారికంగా ప్రకటించింది.

హనుమాన్ నా బాధ్యత పెంచింది

– ప్రశాంత్ వర్మ



చైతన్య, వరలక్ష్మి, తేజ సజ్జా, అమృతా అయ్యర్, ప్రశాంత్ వర్మ, నిరంజన్ రెడ్డి

''హనుమాన్' సినిమా విజయానికి కారణమైన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ అందరి రుణం 'జై హనుమాన్' సినిమాతో తీర్చుకోబోతున్నాను. 'హనుమాన్'కి వంద రెట్లు ఎక్కువగా 'జై హనుమాన్' ఉంటుంది'' అని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జనవరి 12న విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ–''హనుమాన్'కి వచ్చిన స్పందన చూసిన తర్వాత నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఇది నాపై ఇంకా బాధ్యత పెంచింది. ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్స్‌కి వచ్చే చిత్రాలను బాధ్యతగా తీస్తాను'' అన్నారు. ''మా చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు పాదాభివందనం'' అన్నారు తేజ. ''హనుమాన్'ని హిట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు నిరంజన్ రెడ్డి.


నలుగురు స్నేహితుల కథ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, సువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ సినిమాని మార్చి 22న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. విక్రమ్ రెడి మాట్లాడుతూ– ''నలుగురు స్నేహితుల కథే 'రోటి కపడా రొమాన్స్'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో కుటుంబ ప్రేక్షకులను అలరించే భావోద్వేగాలు కూడా ఉన్నాయి'' అన్నారు.



సువేక్ష, తరుణ్

సస్పెన్స్ బహుముఖం



హర్షివ్ కార్తీక్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, రచించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ – యాక్టర్' అనేది ట్యాగ్‌లైన్. క్రిస్టల్ మౌంటైన్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రంలో స్వర్ణిమా సింగ్, మరియా మార్టినోవా హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం నుంచి హర్షివ్ కార్తీక్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ– ''సస్పెన్స్, డ్రామా, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: అరవింద్ రెడ్డి, కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, సంగీతం: ఫణి కల్యాణ్.